ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
గురువారం 13 జూన్ 2024





ఆకివీడులో బాణసంచా కాల్చి సంబరాలు

హమ్మయ్య !

కూటమి విజయంతో కొత్త హుషారు

అన్ని వర్గాల ప్రజల్లోనూ ప్రశాంతత

ఇది మరో స్వాతంత్ర్యం అంటున్న వృద్ధులు

పాలకొల్లు, జూన్, 12 : కూటమి కొలువు దీరింది. సర్వత్రా ఆనంద డోళికల్లో తేలియాడుతున్నారు.ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజల్లో ఏదో తెలియని ఆనందం కనిపిస్తోంది. ప్రశాంత వాతావరణంలోకి వెళ్లారు. కూటమి అధికారం చేపడుతుందని ఎన్నికల నాటి నుంచి సంకేతాలు వస్తున్నప్పటికీ ఈ స్థాయిలో సీట్లు వస్తాయని ఊహించ లేదు. జగన్ కోటరీకైతే నోట మాటే లేదు. బూతుల మంత్రులు, శాపనార్థాల బ్యాచ్ అడ్రస్ లేకుండా పోయారు. ఇవన్నీ గమనిస్తూ వచ్చిన ప్రజలు కూటమి విజయంతో మరో ఐదేళ్లు ప్రశాంతంగా జీవించవచ్చనే భావనలోకి వెళ్లారు. మొన్నటి వరకూ మాకు తిరుగే లేదని విర్రవీగిన వైసీపీ శ్రేణులు పూర్తిగా కనుమరుగయ్యారు. ఉమ్మడి జిల్లాలో వాతావరణం పూర్తి ప్రశాంతంగా ఉంది. స్థానిక పోలీసులకు ఐజీ నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో శాంతి భద్రతలకు పెద్ద పీట వేశారు. ఎన్నికల ప్రచారంలో కూటమి తరపున చంద్రబాబు ఇచ్చిన హామీలు అన్ని వర్గాల ప్రజలను మెప్పించే విధంగానే ఉన్నాయి. మెగా డీఎస్సీ వేతన జీవులకు ఊరట నివ్వనున్నది. పింఛన్ సొమ్ము పెంపుదల వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు భరోసా కానున్నది. ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు పేదింటి మహిళల కట్టె పొయ్యలకు స్వస్తి చెప్పనున్నది. ఆరు గాలం శ్రమించినా ఆదాయం పొందని సన్న, చిన్నకారు రైతాంగానికి చంద్రబాబు ఇచ్చిన హామీ కొండంత బలం అవ్వనున్నది. నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో మహిళలకు నెలనెలా అందించనున్న సాయం రూ.15 వందలు ఆ కుటుంబా నికి ఆసరా కానున్నది. ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వస్తే మహిళల ఆర్థిక పురోభివృద్ధికి మరింత దోహద పడుతుంది. మొత్తంగా కూటమి కొలువు తీరడం మరో స్వాతంత్ర్యమని జిల్లా ప్రజలు అభివర్ణిస్తున్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన



చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలో కొలువుదీరిన ప్రభుత్వంతో సుపరిపాలన సాధ్యం. ప్రజాసంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. అరాచక పాలన నుంచి విముక్తి కలగడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

-తాళ్లూరి శ్రీనివాస్, యలమంచిలి

అన్ని వర్గాల ప్రజలకు మేలు



టీడీపీ, జనసేన ఉమ్మడి మేని ఫెస్టోలో పొందుపరిచిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం త్వరలోనే అమలు చేయనుండటంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర నుంది. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు పెద్దపీట వేసి వారి అభ్యున్నతికి బాటలు వేసింది. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెట్టడం ఖాయం.

- మామిడిశెట్టి పెద్దిరాజు, బూరుగుపల్లి

వైసీపీ పాలనలో చాలా ఇబ్బందులు పడ్డా



వైసీపీ పాలన మెరుగ్గా ఉంటుందని ఆ పార్టీ విజయానికి కృషి చేశా. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నేను నిర్మించుకున్న ఇళ్లు చంద్రబాబు పాలనలో మంజూరైందనే కక్షతో వైసీపీ ప్రభుత్వం రావాల్సిన సొమ్ము ఇవ్వలేదు. వైసీపీ పాలనలో ఎక్కడా, ఎవరికీ స్వేచ్ఛ లేకుండా పోయింది.

-కుక్కల నాగమల్లేశ్వరరావు, మొగల్తూరు

కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. సీఎంగా చంద్రబాబు నాయుడు, మంత్రులు అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా నుంచి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మంత్రి పదవి చేపట్టారు. విభజిత జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మంత్రివర్గంలో చేరారు. ఏలూరు జిల్లాలో నూజివీడు నుంచి కొలుసు పార్థసారిధి, తూర్పుగోదావరి జిల్లాలో నిడదవోలు నుంచి కందుల దుర్గేష్‌లకు మంత్రి పదవులు వరించాయి. ఆయా జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమం యుద్ధప్రాతిపదికన పుంజుకోవాల్సి ఉంది. ఐదేళ్లుగా పెండింగ్‌లో వున్న పనులను పూర్తిచేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో జిల్లా అంతటా జోష్ నెలకొంది. ఊరూవాడా పండుగ వాతావరణం కనిపించింది.



మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నిమ్మల రామానాయుడు

కూటమి కోలాహలం

కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో జిల్లాలో అంతటా జోష్



పాలకొల్లు గోపురం సెంటర్‌లో ..

ప్రమాణ స్వీకార మహోత్సవానికి తరలి వెళ్లిన నాయకులు, కార్యకర్తలు

ఊరూ వాడా సంబరాలు

తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు

అన్ని వర్గాల్లోనూ కొత్త ఉత్సాహం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లా వాసుల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు అవడంతో సంబరాలు మిన్నంటాయి. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది సంబరాలు చేసుకున్నారు. అత్యధికు లు మిఠాయిలు పంచుకున్నారు. ఒకరికి ఒకరు ఆలింగనాలు చేసుకుని అభినందనల్లో మునిగితేలారు. ప్రత్యక్షంగా ప్రసారమవుతున్న ప్రమాణ స్వీకారాన్ని ఎల్ఈడీల ముందు వేలాది మంది మహిళలు, యువకులు, రైతులు కూర్చుని ఆసక్తిగా గమనించారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు ప్రమాణ స్వీకార మహోత్సవానికి తరలి వెళ్లారు. ప్రతి నియోజకవర్గానికి 200 పాస్‌లు మాత్రమే జారీ చేశారు. నాలుగు బస్సులు కేటాయించారు. అయినా సరే స్వచ్ఛందంగా అభిమానులు, కార్యకర్తలు సొంత వాహనాలతో విజయవాడ పయ నమయ్యారు. ఉదయం ఐదు గంటలకే జిల్లా నుంచి వాహనాలు తరలివెళ్లాయి. ర్యాలీగా బస్సుల్లోనూ పెద్ద సంఖ్యలో వెళ్లారు. జిల్లాలో జనం టీవీలకు అతుక్కు పోయారు.ప్రమాణ స్వీకార ఉత్సవాన్ని తిలకించేందుకు జిల్లాలో ఎల్ఈడీ స్క్రీన్ లను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గం, పట్టణాల్లో రెండు చోట్ల స్క్రీన్‌లు ఏర్పాటు చేసి జనం కూర్చోవడానికి వసతులు కల్పించారు. మహిళలు, వృద్ధులు, యువత స్క్రీన్‌ల వద్ద కేరింతలు కొట్టారు. ప్రతిచోట కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అపార్ట్‌మెంట్‌లలో పార్టీలు నిర్వహించుకున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామంలో బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచిపెట్టారు. అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. జిల్లా నుంచి వెళ్లిన కార్యకర్తలు, అభిమానులు ట్రాఫిక్ అంతరాయం కలగడంతో కొంతమంది మధ్య దారి నుంచే వెనక్కు వచ్చేశారు. తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరపుకొన్నారు. యలమంచిలి మండలంలో టీడీపీ నాయకుడు తాళ్లూరి బుజ్జి పేదలకు 63 సైకిళ్లను ఉచితంగా అందజేశారు. జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ తెలుగుదేశం, కూటమి శ్రేణులు పండగ చేసుకున్నాయి. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం పట్టణాలతో పాటు, గ్రామాల్లో ప్రమాణ స్వీకారంపైనే చర్చ సాగింది. ప్రధాన కూడళ్ల వద్ద జనాలు కొత్త ప్రభుత్వంపై చర్చించుకున్నారు. ఇక రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందంటూ అంతా ఆనందంలో మునిగి తేలారు.వ్యాపారులు, సామాన్యులు అయితే స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నామంటూ సంబర పడిపోయారు.కొత్త ప్రభుత్వం రాకతో అందరిలోనూ ఉత్సాహం అలముకుంది. ఊరూ వాడా సంబరాలతో సందడి చేశాయి.

మరోలా సీనియర్ల సేవలు

మంత్రి వర్గంలో కొందరికే అవకాశం దక్కడంతో మిగిలిన వారి సేవలను వినియోగించుకోవడానికి కూటమి నాయకత్వం సిద్ధమవుతోంది. టీడీపీ హయాంలో ప్రభుత్వ విప్‌గా చింతమనేని ప్రభాకర్ వ్యవహరించారు. ఈసారి ఆయన సేవలు వినియోగించుకునే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. చురుగ్గా ఉన్న ఎమ్మెల్యేలకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగిస్తారని భావిస్తున్నారు. ఈ తరహా కసరత్తు ఒకటి, రెండు రోజుల్లో ముగియనుంది. ఆ తరువాత కీలక ప్రకటనలు వెలువడతాయని ఆశిస్తున్నారు. ఈ నెల 17న శాసనసభ సమావేశమయ్యే అవకాశం ఉన్నందున దాని కంటే ముందు, లేదా ఆ తదుపరి చంద్రబాబు తీసుకునే కీలక నిర్ణయాలు అత్యాద్భుతంగా ఉంటాయని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. మంత్రి వర్గ కూర్పులో ఎవరికి ఎలాంటి అసంతృప్తి లేకపోయినా వీలైనంత మేర అందరు సంతృప్తిపడే విధంగానే వరుస నిర్ణయాలు ఉంటాయని సీనియర్లు చెబుతున్నారు. పొత్తులో భాగంగా త్యాగాలకు ఓర్చిన గన్ని వీరాంజనేయులతో పాటు బొరగం శ్రీనివాసరావు, ఆకుమర్తి రామారావు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వంటి నేతలకు తగు ప్రాధాన్యం కల్పిస్తారని అంచనాకు వచ్చారు.

కూటమిలో భాగస్వామ్యం నా అదృష్టం

మంత్రి కందుల దుర్గేష్



ప్రజలు తమ అభివృద్ధి సంక్షేమం కోసం ఎన్నుకున్న కూటమి ప్రభుత్వంలో నాకు భాగస్వామ్యం లభించడం నా అదృష్టం.ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది. ఆ దుర్మార్గ పాలనను ప్రజలు అంతం చేశారు. నూతన అధ్యాయానికి నాంది పలికారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి పాలన ప్రజలకు అందిచేందుకు కృషి చేస్తా. చంద్రబాబు యుక్తి, పవన్ శక్తి, ప్రధాని మోదీ స్ఫూర్తితో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళతాం. నిడదవోలు నియోజకవర్గాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాలపై పూర్తిగా దృష్టి పెడతాం.

- నిడదవోలు



పాలకొల్లులో ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రమాణ స్వీకారోత్సవం తిలకిస్తున్న మహిళలు

జవాబుదారీతనంగా పనిచేస్తా

మంత్రిగా నిమ్మల ప్రమాణ స్వీకారం

భీమవరం/పాలకొల్లు అర్బన్/నరసాపురం/మొగల్తూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): 'ప్రజలు ఇచ్చిన భారీ మెజార్టీ మాలో బాధ్యత, జవాబుదారీతనం పెంచింది. వైసీపీ ప్రభుత్వంలోని మంత్రుల్లా మేం జవాబుదారీతనం లేకుండా పనిచేయం. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటాం. వారికి ఇచ్చిన హామీలు అమలు చేసి అభివృద్ధి దిశగా పని చేస్తాం. ప్రధాని, కేంద్ర మంత్రులు, పార్టీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ సమక్షంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం నా అదృష్టం.' అని నిమ్మల రామానాయుడు అన్నారు. టీడీపీ తరఫున పాలకొల్లు ఎమ్మెల్యేగా మూడోసారి ఎన్నికైన ఆయనకు చంద్రబాబు కేబినెట్‌లో బెర్త్ దొరకడంతో బుధవారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి కృష్ణా జిల్లా మీదుగా ఆయన బుధవారం రాత్రి పశ్చిమ సరిహద్దులో అడుగుపెట్టిన ఆయనకు టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. మొగల్తూరు, నరసాపురంలలో ఆయనకు నీరాజనాలు పట్టారు. సీతారాంపురం వద్ద భారీ గజమాలతో సన్మానించారు. వినాయకుడి ఆలయంలో పూజలు చేశారు. కలవకొలను తాతాజీ, చాగంటి చిన్న పాల్గొన్నారు. మొగల్తూరు 216 జాతీయ రహదారిపై నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు మంత్రి నిమ్మల కాన్వాయిను ఆపి స్వాగతం పలికారు. వందలాది మంది కార్యకర్తలు, గ్రామస్థుల మధ్య ఆయన కేక్ చేశారు.

పోరాట యోధుడు.. నిమ్మల



పాలకొల్లు మండలం ఆగర్తిపాలెంలో సామాన్య మధ్య తరగతి రైతు కుటుంబీ కులు నిమ్మల ధర్మారావు, రమావల్లి దంపతులకు 1969 మే 6న జన్మించారు. ఆయనకు భార్య సూర్యకుమారి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రాథమిక విద్య ఆగర్తిపాలెంలోనూ, హైస్కూల్ విద్య పాలకొల్లు హైస్కూల్, కళాశాల విద్య నరసాపురం వైఎన్ కళాశాలలోనూ పూర్తిచేశారు. ఆంధ్రా యూనివర్శిటీలో ఎంఎ, పీహెచ్‌డీ చేశారు. యూనివర్శిటీలో చదివే సమయంలో విద్యార్థి నాయకుడిగా విద్యా సమస్యలపై పోరాటాలు చేశారు. తాను చదువుకున్న వైఎన్ కళాశాలలో అధ్యాపకు నిగా కొంత కాలం పనిచేశారు. 2008లో తన తండ్రి పేరున ధర్మారావు ఫౌండేషన్ ఏర్పాటుచేసి తనకున్న ఆస్తిలో పది ఎకరాలను ఫౌండేషన్‌కు రాసి దాని మీద వచ్చే ఆదాయంతో నియోజకవర్గంలో పలుసేవా కార్యక్రమాలు చేపట్టారు. 2012లో తెలుగుదేశంలో చేరి, మండల కమిటీ అధ్యక్షుడిగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతు సమస్యలపై పోరాటం చేశారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాట యోధుడుగా గుర్తింపు తెచ్చుకున్నారు.

టీడీపీ నుంచి పాలకొల్లుకు తొలి మంత్రి పదవి

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి 40 ఏళ్ళలో పాలకొల్లు నుంచి ఏడుసార్లు టీడీపీ అభ్యర్థులు విజయం సాధించినప్పటికీ మంత్రి పదవి మాత్రం లభించలేదు. 8వ సారి విజయం సాధించిన డాక్టర్ నిమ్మల రామానాయుడుకు ఈసారి మంత్రి వర్గంలో స్థానం లభించడంతో పాలకొల్లు నియోజకవర్గ ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా 1989లో విజయం సాధించిన చేగొండి వెంకట హరి రామజోగయ్య తొలిసారిగా మంత్రి వర్గంలో స్థానం సంపాదించారు. కేంద్రంలో ఇప్పటికే నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా నియమితులయ్యారు. జిల్లాలో రెండు మంత్రి పదవులు దక్కినట్టయింది. వాస్తవానికి 2014 కూటమి ప్రభుత్వం ఉమ్మడి పశ్చిమ గోదావరిలో క్లీన్ స్వీప్ చేసినప్పుడు తొలుత మంత్రి పదవి కేటాయించలేదు. రెండున్నరేళ్ల తర్వాత పితాని సత్యనారాయణకు మంత్రి పదవి లభించింది. ఈసారి పితాని కూడా రేసులో ఉంటారని అంతా ఆశించారు. అయితే సమీకరణల్లో ఒక్కరికే అవకాశం లభించింది.



మొగల్తూరులో కేక్ కట్ చేస్తున్న నిమ్మల



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భీమవరం టౌన్ జూన్ 12 : ప్రభుత్వ ఆసుపత్రుల నందు ప్రసవాలను ప్రోత్సహించాలని, ఇందుకు వైద్యాధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని పీహెచ్‌సీల వైద్య అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సీజన్‌లో చిన్నారులు ఎవరు డెంగీతో చనిపోరాదని, అందరూ కలిసికట్టుగా పనిచేసి మలేరియా, డెంగ్యూ వ్యాధులను అరికట్టాలన్నారు. డెంగీ వ్యాధి సోకినా తక్షణమే చికిత్స అందించాలన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ లో కూడా సమాచారాన్ని సేకరించి ఎక్కడైనా వ్యాధి లక్షణాలు కని పించిన వెంటనే చికిత్స అందించేలా చర్యలు తీసుకోవా లన్నారు. దోమలను అరికట్టేందుకు పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు, మలేరియా, డెంగీ సీజనల్ వ్యాధులు, రక్తహీనత, మందుల నిల్వలు, తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ ఆసు పత్రిలో నూరుశాతం డెలివరీలు జరగాలని, తక్కువగా డెలివరీలు జరుగుతున్న ఆస్పత్రులను సమీక్షించుకుని తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. రోగుల నుంచి అభిప్రాయ సేకరణ తీసుకోవాలన్నారు. రక్తహీనతకు సంబంధించి రోగులు ఐరన్ టాబ్లెట్‌లు, ఇంజక్షన్లు తీసుకుంటున్నారో లేదో సమాచారాన్ని తీసుకొని సమీక్షించాలన్నారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో వివరాలను అప్డేట్ చేసి చెక్ చేసు కోవాలన్నారు. జిల్లాలో మందుల నిల్వలు సమీక్షించుకుని, అవసరమైన వాటికి ఇండెంట్ పెట్టాలని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణరావు, డీపీఎంవో డాక్టర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

యూనిఫాం ఏది సార్ ?

నేటికీ చేరని దుస్తులు..విద్యార్థుల ఆందోళన



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 12 :నేటి నుంచి బడులు తెరేస్తున్నారు. కానీ నేటికీ జిల్లాలో ఏ పాఠశాల విద్యార్థికి యూనిఫారాలు అందలేదు. యూనిఫాం క్లాత్ వచ్చి బయట కుట్టించడానికి కనీసం పక్షం రోజులు పైనే పడుతుంది. స్కూల్ తెరిచే నాటికి కుట్టించిన యూనిఫారాలు అందించాల్సిన అధికారులు కనీసం క్లాత్ కూడా అందించక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. జిల్లాలోని 1 నుంచి పది వరకూ విద్యార్థులకు ఇవ్వాల్సిన టెక్స్ట్ బుక్స్ కూడా సగమే చేరుకున్నాయి. దీంతో విద్యా సంవత్సరం ప్రారంభంలోనే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. గత ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన విద్యా సామగ్రి కంటే ఎన్నికలపై దృష్టి పెట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పుడు కుట్టించాలి



గతంలో టీడీపీ హయాంలో విద్యార్థుల యూనిఫారాలు ఏజన్సీలకు అప్పగించి క్లాసుల వారీగా సైజులను బట్టి కుట్టించి స్కూల్ తెరిచేనాటికి టెక్స్ట్ బుక్స్‌తో పాటు అందించేవారు. తరువాత ఆ ఏజన్సీల నిర్వహణలో క్లాత్ క్వాలిటీ ఉండటం లేదని కుట్టు సరిగా ఉండటం లేదని విమర్శలు రావడంతో స్కూల్స్ ఖాతాలకు సొమ్ములు వేసి హెచ్ఎంలే బాధ్యతగా తమ పాఠశాలల విద్యార్థులకు క్లాత్ కొని కుట్టించే బాధ్యత అప్పగించారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వమే క్లాత్ కొనుగోలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు క్లాత్ అందిస్తూ వస్తున్నది . కుట్టించుకునేందుకు సొమ్ము తల్లిదండ్రుల ఖాతాలకు వేసే వారు. కానీ నేటికీ ఆ క్లాత్ విద్యార్థుల తల్లిదండ్రులకు చేరలేదు. నేటి నుంచి పాఠశాలలు తెరుచుకుంటుండడంతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

టెక్స్ట్ బుక్స్ పరిస్థితి అంతే..

జిల్లాలో 1 నుంచి 7వ తరగతి వరకూ విద్యార్థులకు 12 లక్షల 2192 పుస్తకాలు అందించాల్సి ఉండగా ఇప్పటి వరకూ 7 లక్షల 39వేల పుస్తకాలు జిల్లా బుక్ డిపోకు చేరుకున్నాయి. అంటే ఇంకా 4 లక్షల 62 వేల పుస్తకాలు రావాల్సి ఉంది. ఈ లెక్కన జిల్లాలో ఇంకా మూడో వంతు పుస్తకాలు బుక్ డిపోకు చేరాల్సి ఉంది.ఆ పుస్తకాలు ఏప్పుడు వస్తాయో ఎప్పుడు పాఠశాలలకు పంపిస్తారో అంతా గందరగోళ వాతావరణం నెలకొంది.

కొత్త సిలబస్ ముద్రణే పూర్తికాలేదు..

ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు కొత్త సిలబస్ అందించే యోచనలో ఉంది. దీనికోసం ఉత్తరప్రదేశ్‌లోని పుస్తకాల ముద్రణ కేంద్రానికి కాంట్రాక్టు ఇచ్చారు. అయితే ఆ పుస్తకాల ముద్రనే ఇంకా పూర్తికాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలల పునర్ ప్రారంభం అవుతున్న సందర్భంలో ఎప్పుడు ఈ పుస్తకాలు వచ్చి చేరతాయో ? ఎప్పుడు విద్యార్థులకు సిలబస్ ప్రారంభిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది

కిట్‌లలోనూ నాణ్యతా లోపం..



జగనన్న కిట్‌ల పేరిట ప్రతీ ఏటా అందించే స్కూల్ బ్యాగ్స్, బెల్టు, షూ, నోట్‌బుక్స్, నాణ్యత లేని విమర్శలు వినిపించాయి. బ్యాగ్‌లైతే మరీ పిల్లలకు ఇచ్చిన వారం రోజుల్లోనే చిరిగిపోయేవి. వాటిని తిరిగి కుట్టించుకునేందుకే రూ.500 ఖర్చుచేయాల్సి వచ్చేది. మిగిలినవి నాణ్యత లేక పోవడంతో ప్రభుత్వ సొమ్ములు దుర్వినియోగమయ్యేవి.

ప్లస్‌టూ.. సంగతేంటి ?

బోధన, సౌకర్యాలు లేక విద్యార్థుల ఇబ్బంది

60 శాతానికిపైగా విద్యార్థినుల ఫెయిల్

నేటి నుంచి క్లాసులు ప్రారంభం.. అడ్మిషన్లు కష్టమే



భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 12 : ప్లస్‌టూ ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటైన రెండేళ్లకే అటకెక్కినట్లయ్యింది. బోధన సరిలేక, సౌకర్యాలు లేక విద్యార్థినులకు విద్యలో తడబాటు తప్పలేదు. ఫలితాల్లో కూడా వెనుకబడేలా చేసింది. కొత్త ప్రభుత్వం ప్లస్‌టూపై దృష్టి పెడు తుందా..? అనేది విద్యార్థుల తల్లితండ్రులు ఆలోచిస్తున్నారు. 2022-23 విద్యా సంవత్సరం మొదటి బ్యాచ్‌లో హైస్కూల్‌లోని ఉపాధ్యాయులతోనే తరగతులు నిర్వహించారు. జిల్లాలోని 16 ప్లస్‌టూ పాఠశాలల్లో 2022-23 మొదటి సంవత్సర విద్యార్థినులు 120 మంది చేరితే 20 శాతం మందే ఉత్తీర్ణత సాధించారు. ఇక 2024 ప్రథమ సంవత్సర విద్యార్థినులు 206 మంది చేరగా 61 మంది ఉత్తీర్ణులై 145 మంది ఫెయిలయ్యారు. దీంతో విద్యార్థుల తల్లితండ్రుల నుంచి ప్లస్‌టూ పాఠశాలలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.గొప్పలకు పోయిన గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో టెన్త్ పూర్తయిన విద్యార్థినులు ప్లస్‌టూ పాఠశాలలో చేరాలంటూ ఒత్తిడి తెచ్చిమరీ చేర్పించి విద్యలో వెనుకబడేలా చేశారు. ప్లస్‌టూ చదవడానికి పుస్తకాలు అందించలేదు. ల్యాబ్‌లు లేవు..బోధన ప్రణాళిక లేదు. చివరికి ఫెయిల్ ఫలితాలు తెచ్చారు. విద్యార్థినుల భవిష్యత్‌ను అయోమయంలో పడేశారు.

పీఎం అవార్డుల ఎంపికకు కేంద్ర బృందం పర్యటన



స్నేహితులతో కలసి బీచ్‌కు వెళ్లి..
రామాపురం సముద్రతీరంలో తాడేపల్లిగూడెం విద్యార్థి మృతి

మొదలైన ఇసుక కష్టాలు 7
నూతన పాలసీ కోసం ఎదురుచూపు



63 మంది పేదలకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ



పేదలకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

యలమంచిలి, జూన్ 12: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, మంత్రిగా నిమ్మల రామానాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా యలమంచిలిలో టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి) సుమారు రూ.3.5 లక్షలతో సమకూర్చిన సైకిళ్లను 63 మంది పేదలకు బుధవారం పంపిణీ చేశారు. స్థానిక ప్రధాన కూడలి వద్ద, మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి), టీడీపీ, జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి) మాట్లాడుతూ రెండున్నరేళ్లలో మొత్తం 156 సైకిళ్లు పేదలకు అందజేశామన్నారు. తాళ్లూరి వెంకటేశ్వరరావు, చిలుకూరి కుమార్, తాళ్లూరి సత్యశ్రీను, కొడవటి వరబాబు, బర్రే ప్రసాద్, ఆకుల ఏసు, బొప్పన రాంబాబు, శనగళ్ల శ్రీనివాస్, తాళ్లూరి చందు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు మంచి రోజులు వచ్చాయి'



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్లు, టీడీపీ కూటమి శ్రేణులు

ఆకివీడు, జూన్ 12: ఆకలన్న వారికి అన్నం పెట్టడం పుణ్యమని లయన్స్ పాస్ట్ గవర్నర్, కువైట్ డాక్టర్ ఎంవీఎస్ రాజు అన్నారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా స్థానిక దొరగారి చెరువు దగ్గర గొట్టుముక్కల వెంకట సుబ్బరాజు జ్ఞాపకార్థం కుమారులు సత్యనారాయణరాజు, రామకృష్ణంరాజు, సూర్యనారాయణరాజు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో అధికారంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసే వరకూ దాతలు ఆర్థిక సహకారంతో నిర్వహిస్తామన్నారు. ప్రముఖ వైద్యులు బిలాల్, మహేష్‌వర్మ, నౌకట్ల రామారావు, భూపతిరాజు తిమ్మరాజు, గంధం ఉమా, గుర్రం శ్రీనివాసరావు, పిన్నమరాజు మురళీరాజు, గొంట్లా కృష్ణమూర్తి, అల్లు మధు, కూటమి నేతలు తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

భీమవరం టౌన్, జూన్ 12 : జిల్లాలో ఉన్న మునిసిపాలిటీల్లో పారిశుధ్యంతో పాటు డ్రైన్లల్లో సిల్ట్ తొలగింపు తదితర పనులను పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక అధికారులను నియమించారు.. భీమవరానికి జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావును, పాలకొల్లుకు డీఎల్‌డీవో కేసీహెచ్ అప్పారావును, నరసాపురం డ్వామా పీడీ ప్రభాకర రావును, ఆకివీడుకు సీపీవో మోహన్ రావును, తాడేపల్లిగూడెంకు డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్‌ను, తణుకుకు జిల్లా పరిశ్రమ శాఖ అధికారి మంగపతిరావును నియమించారు. వీరు పనులకు సంబంధించి నివేదికలను తనకు ఇవ్వాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.

ప్రధాన డ్రైన్లలో పూడిక తీయించాలి

భీమవరం టౌన్, జూన్ 12 :పట్టణంలోని ప్రధాన డ్రైన్లలో పూడిక తీయించడానికి తగు ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రత్యేక పారిశుధ్య అధికారి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు సూచించారు. మునిసిపాలిటిలో కమిషనర్ ఎం.శ్యామల అధ్యక్షత బుధవారం జరిగిన పారిశుధ్య అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశలో ఆయన మాట్లాడారు. ప్రధాన డ్రైన్లలో పూడిక తీయడానికి కాంట్రాక్టర్లను పిలిచి మేజర్ డ్రైవింగ్ యొక్క డీసిల్టేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాన డ్రైన్లను కలిపే డ్రైన్లలో పూడిక తీయడానికి పురపాలక సంఘంలో ఉన్న యంత్రాలను ఉపయోగించాలన్నారు. వచ్చే నెల 15వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **నరసాపురం :** నరసాపురం సొసైటీ అధ్యక్ష పదవికి షేక్ బుల్లిమస్తాన్ బుధవారం రాజీనామా చేశారు. ఆయనతో పాటు ముగ్గురు డైరెక్టర్లు(పర్సన్ ఇన్‌చార్జి) కూడా రాజీనామా చేశారు.
- **తణుకు :** రవీంద్ర ఐటీఐలో విద్యార్థులకు అప్రంటీస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. 19న భీమవరం ప్రభుత్వ ఐటీఐలో జరిగే జాబ్ మేళాకు అందరూ హాజరుకావాలని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ బసవా రామకృష్ణ సూచించారు.
- **నరసాపురం రూరల్ :** సబ్ డివిజన్ పరిధిలో ఎంటీయూ 1061, 064, సంపద స్వర్ణ వంటి రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. రైతులు ముందుగా పేర్లను నమోదు చేసుకుని విత్తనాలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు 203 టన్నుల యూరియా, కాంప్లెక్స్, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ వంటి ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు.
- **పెంటపాడు :** అలంపురం ట్రస్టు ఆసుపత్రికి గురువారం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు.
- **పాలకొల్లు :** ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన పవన్ కళ్యాణ్‌లకు మాజీ ఎంపీ, కాపు బలిజ సమాఖ్య సేన అధ్యక్షుడు చేగొండి హరిరామ జోగయ్య బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.
- **తాడేపల్లిగూడెం రూరల్ :** జిల్లాలోని వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కె.శోభారాణి సూచించారు. తాడేపల్లిగూడెంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో బుధవారం వసతి గృహ సంక్షేమ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వసతిగృహాల్లో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.
- **కాళ్ల (ఉండి) :** కాళ్లకూరులోని వేంకటేశ్వరస్వామి బుధవారం హూండి లెక్కించగా 83 రోజులకు రూ.17,09,477లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.అరుణకుమార్ తెలిపారు.
- **భీమవరం టౌన్ :** మావుళ్లమ్మవారికి ఆకివీడుకు చెందిన శ్రీనివాస్, పురుషోత్తం నాగ వెంకట కనకదుర్గా దంపతులు బుధవారం 32 కేజీల ఐదు ఇత్తడి గరగలను సమర్పించారు.
- **అత్తిలి :** మండలంలోని కొమ్మరలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి చిన్నారులను కేంద్రాలకు పంపించాలని గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు సూచించారు. మహిళా సంరక్షణాధికారి శిల్ప, అంగన్వాడీ కార్యకర్తలు రాణి, మణి, మేనక తదితరులు పాల్గొన్నారు.
- **నరసాపురం రూరల్ :** ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలంటూ బుధవారం మండలంలోని కొప్పర్రులో సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. నెలలు తరబడి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీపీఎం జిల్లా నాయకులు కవురు పెద్దిరాజు మండిపడ్డారు.



మార్టేరు సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న కూటమి శ్రేణులు



భీమవరంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం



పెంటపాడులో హర్షాతిరేకాలు తెలుపుతున్న మహిళలు



తణుకులో కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు

ప్రమాణస్వీకారోత్సవ సంబరాలు

» నాలుగో సారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం » పలు ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు » వీక్షించిన కూటమి శ్రేణులు, ప్రజలు

భీమవరం టౌన్, జూన్ 12 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు ఆధ్వర్యంలో నాలుగో వార్డు నరసయ్య అగ్రహారంలో కేక్‌కట్ చేసి మహిళలకు చీరలు, బియ్యం, వంట సరుకులు అందజేశారు. పార్టీ నాయకులు గునుపూటి తిరుపాల్, లంకి చిన్ని, కొండ్రు శ్రీనివాస్, ఐఏఎస్ యాదవ్, నేదునూరి గంగాధర్ తిలక్, గంధం రాధ, విన్నకోట వినాయక్ కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● ఆకివీడు : చంద్రబాబు ప్రమాణస్వీకారం తిలకించేందుకు స్థానిక నగర పంచాయతీ నేతృత్వంలో టీడీపీ కార్యాలయం వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఏడో వార్డులో కౌన్సిలర్ కిమిడి అరుణ కుమారి పలువురు పెద్దల్ని సన్మానించారు. మాదివాడ టీడీపీ మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్ జనసేన నాయకుడు ముత్యాల రత్నంను గజమాలతో జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు ఘనంగా సత్కరించారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, ప్రధాన కార్యదర్శులు నౌకట్ల రామారావు, గంధం ఉమా, క్లస్టర్ ఇన్‌చార్జి గొంట్లా గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్జల్, సిరాజుద్దీన్, టీడీపీ, జనసేన కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, కిమిడి అరుణకుమారి, బత్తుల శ్యామల, మోపిదేవి సత్యవతి, తదితరులుపాల్గొన్నారు.

● పెనుగొండ : చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారాన్ని పెనుగొండలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలు వీక్షించారు. మండలంలోని పలు గ్రామంల్లో కూటమి నేతలు సంబారాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. ఎంపీడీవో శ్రీనివాస దొర, కూటమి నాయకులు నక్కా వేద వ్యాస శాస్త్రి, కటికిరెడ్డి నానాజీ, వేండ్ర రాము, ఉప్పలపాటి చంటి, చిలుకూరి ప్రసన్నకుమారి, వలపన నరేష్, గణపతినీడి, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ఆచంటలో బాణసంచా కాలుస్తున్న కూటమి శ్రేణులు

● ఆచంట : కలెక్టర్ ఆదేశాల మేరకు ఆచంట శివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లో చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని ప్రజలు వీక్షించారు. కూటమి శ్రేణులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్ బాబు, దేవస్థానం ఈవో రాము, పంచాయతీ కార్యదర్శి నాగబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నరసాపురం టౌన్ :చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించేందుకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. కూటమి నాయకులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. పట్టణంలోని జనసేన నాయకులు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

● తణుకు : వేల్పూరు రోడ్డులోని వీకే ఫంక్షన్ హాల్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని కూటమి శ్రేణులు వీక్షించారు. బాణసంచా కాల్చారు. మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ నాయకులు మంత్రిరావు వెంకట రత్నం (బాబు), తాతపూడి మారుతీరావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నరేంద్ర సెంటర్‌లోను ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు.

● తాడేపల్లిగూడెం : చంద్రబాబు ప్రమాణస్వీకార వేడుకల్ని తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లో కూటమి నాయకులు, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వేడుకను తిలకించారు. ఏర్పాట్లను ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం. వెంకటేశ్ పర్యవేక్షించారు.

● పెంటపాడు : వెలమ సంఘం మేడ వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసి నాయకులు, అధికారులు, డ్వాక్రా మహిళలు చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకించారు. కె.పెంటపాడులో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గంధం సతీష్ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రమాణస్వీకారాన్ని తిలకించారు. కూటమి శ్రేణులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, ఎంపీడీవో సీహెచ్ బాలాజీ వెంకటరమణ, ఎంఈవో శ్రీనివాస్, ఏపీఎం మహమ్మద్, నాయకులు కేబుల్ వెంకట్రావు, నక్కా సాంబశివరావు, నల్లమిల్లి చినగోపిరెడ్డి, దాసరి సత్యనారా యణ, నాళం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సర్పంచ్ పీతల సత్యనారా యణ, పంతం శేఖర్, నరాలశెట్టి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

● పాలకొల్లు టౌన్ : టిడ్కో ఇళ్లను ఉచితంగా ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా పాలకొల్లు టిడ్కో గృహాల వద్ద కూటమి నాయకులు, గృహ లబ్ధిదారులు, మహిళలు పెద్దఎత్తున సంబరాలు నిర్వహించారు.

● పాలకొల్లు అర్బన్ : గాంధీ బొమ్మల సెంటర్లో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా సుమారు రెండు వేల మంది ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. పాలకొల్లు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు పేరు రావడంతో ఒక్కసారిగా జై నిమ్మల అంటూ నినాదాలు చేశారు. ప్రజలకు మిఠాయిలు, కూల్ డ్రింక్‌లు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ పార్థసారథి, ఆర్ఐ శ్రీనివాసరాజు, టీపీవో వీరభద్రం పర్యవేక్షించారు. 19వ వార్డులో టీడీపీ నాయకులు బాణసంచా కాల్చి, కేక్‌కట్ చేసి సబంరాలు జరుపుకున్నారు. షేక్ సిలార్, బి.తిరుమలరావు, బందెల భాస్కరరావు, గాదె సుబ్బారావు, ఎ.అబ్దుల్ రహం మాజీ కౌన్సిలర్ శ్రీఖాకోళ్లపు వెంకన్న, 19వ వార్డు నాయకుడు గాదె వెంకన్న, జీవీ సుబ్బారావు, సత్యం తదితరులు

● పాలకొల్లు రూరల్ : డాక్టర్ నిమ్మల రామానాయుడుకు మంత్రి పదవి రావడంతో ఆయన స్వగ్రామం ఆగర్తిపాలెంలో సంబరాలు అంబరా న్ని అంటాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు బంధు మిత్రులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● పాలకోడేరు : చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, నాయకులు కమ్మిలి రాంబాబు కలిది ండి కృష్ణం రాజు, సత్యశ్రీ సంకురుడు, భూపతిరాజు కృష్ణంవర్మ, మధువర్మ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

● మొగల్తూరు : 216 జాతీయ రహదారి వెంబడి గల స్థలంలో ఎల్‌ఈడీలు ఏర్పాటు చేయడంతో పంచాయతీ, సచివాలయం, మండల స్థాయి అధికారులు, స్థానికులు ప్రమాణీ స్వీకారాన్ని వీక్షించారు.

● ఉండి : స్థానిక మార్కెట్ యార్డులో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని ప్రజలు తిలకించారు. ఎంపీడీఓ రవీంద్ర, ఈవోపీఆర్డీ రామకృష్ణ, ఆయా శాఖలకు చెందిన అధికారులు, ఎస్‌హెజీ సభ్యులు, ఎన్ఆర్‌జీఎస్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

● పెనుమంట్ర:కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం వీక్షించేందుకు మార్టేరు అయ్యప్ప స్వామి ఆలయం పక్కన ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కూటమి శ్రేణులు స్వీట్లు పంపిణీ చేసి, బాణసంచా కాల్చారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మజ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది వీఆర్వోలు, మండల టీడీపీ అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, తేతల రాజారెడ్డి కోనాల శ్రీనివాసరెడ్డి వెలగల మల్లికార్జున్ రెడ్డి, కారేపల్లి భాస్కర్ రావు, నాయుడు, మజ్జి అచ్యుతరావు అలీ, వీఆర్వోలు ముత్యాలరావు, గ్రామ కార్యదర్శిపాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్



ఉండి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్



మొగల్తూరులో ప్రమాణస్వీకారాన్ని వీక్షిస్తున్న ఉద్యోగులు, స్థానికులు



వడలిలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న కూటమి శ్రేణులు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం టౌన్, జూన్ 12 :బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రకాశం చౌక్ వద్ద జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. తొలుత బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు పిల్లలు స్కూల్లో గాని, అంగన్వాడీలో మాత్రమే ఉండాలన్నారు. బాలలు ఎక్కడైన పని చేస్తున్నట్లు గురిస్తే వెంటనే కార్మిక శాఖకు తెలపాలన్నారు. పని చేయంచుకునే యాజమాన్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఒక టీంను ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు ఒక్కొక్క మండలంలో వున్న ఫ్యాక్టరీలను, ఇటుక బట్టీలు, షాపులు, హోటళ్లను తనిఖీ చేస్తారన్నారు. ఇందుకు కోసం రానున్న రెండు నెలల కాలానికి కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ వివరించారు. పాఠశాలల్లో విద్యార్థి డ్రాపవుట్స్‌పై దృష్టి సారించామన్నారు. చిన్న తనంలో సంపాద నకు అలవాటు చేస్తే వారు దురాలవాట్లకు పాల్పడే అవకాశముందన్నారు. జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని కె.శోభ రాణి, మున్సిపల్ కమిషనర్ శ్యామల, దిశా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ శ్రీలక్ష్మి, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ సిహెచ్ రంగ సాయి, భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ, విద్యాశాఖ అధికారులు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, భీమవరం ఆదిత్య డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

భీమవరంటౌన్, జూన్ 12 : ఉపాధ్యాయులపై పనిభారం పెంచుతూ వైసీపీ ప్రభుత్వం తీసుకుచ్చిన జీవో నెంబరు 117ను నూతన ప్రభుత్వం రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ మునిసిపల్ ఉతన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాయి వర్మ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన మొదటి కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వెంటనే డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, అమ్మఒడి పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే కల్పించాలని కోరారు. 12వ పీఆర్సీ ప్రకటిస్తూ ఐఆర్ ఇవ్వాలని, కమిటీని నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామచంద్రరావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ దావీదు, జిల్లా ఆర్థిక కార్యదర్శి వీవీడీ ప్రసాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జనార్దన్, అన్ని మండలాల నుంచి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన ఎస్టీయూ ఆకివీడు మండల అధ్యక్షుడు ప్రభాకర్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఆకివీడు, జూన్ 12: ఉండి ఎమ్మెల్యేగా కనుమూరి రఘురామ కృష్ణరాజు అఖండ మెజార్టీతో గెలవడంతో ఆయన సొంత ఊరు అయి-భీమవరంలో గ్రామస్తులు బుధవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కనుమూరు రామకృష్ణంరాజు, అల్లూరి సోమరాజు, నౌకట్ల రామారావు, మీసాల రవి కుమార్, కనుమూరి అనిల్ ప్రసాద్ ఉన్నారు.

బీసీలకు మంత్రి పదవులపై హర్షం

పాలకోడేరు, జూన్ 12: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎనిమిది మంది బీసీలకు మంత్రి పదవులు ఇవ్వడంపై ఉండి నియోజకవర్గ బీసీ టీడీపీ నాయకుడు కామన రాంబాబు హర్షం వ్యక్తం చేశారు.

బాలల్లో ఆధ్యాత్మిక చైతన్యం నింపాలి

భీమవరం టౌన్, జూన్ 12 : బాలల్లో ఆధ్యాత్మిక చైతన్యం నింపాలని ఆర్ట్ఆఫ్ లివింగ్ గురూజీ రవి శంకర్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా రామాయణ భారత భాగవతాలపై బాలలకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించామని శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. వేసవి బాలల శిక్షణ శిబిరం రామాయణ గాథ శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమాన్ని బుధవారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. భీమవరంలోని రామలక్ష్మణ్ నగర్‌లోని రవి శంకర్ శిష్యులు కలిగొట్ల గోపాలశర్మ పర్యవేక్షణలో ఎనిమిది రోజులు శిక్షణ ఇచ్చారని రంగసాయి తెలిపారు. ఆర్ట్ఆఫ్ లివింగ్ యోగ శిక్షకులు మైగాపుల ఫణి, నాగ దీప్తి, గోపాల శర్మ శిక్షణ తరగతుల్లో ఏడుగురు శిక్షణ పొందారని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి శిక్షణ అందించిన గురువులను సత్కరించారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, నరహరి శెట్టి కృష్ణ, ఎస్‌కే చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల బడులు



శిథిలమైన జానకీనగర్ ఎంపీపీ పాఠశాల భవనం

ఆకివీడు, జూన్ 12: సర్కార్ బడులలో సమస్యలు తిష్ట వేశాయి. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నా విద్యార్థులకు కష్టాలు తప్పడంలేదు. శిథిల భవనాల్లో సర్కార్ చదువులు ప్రమాదకరంగా మారాయి. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు పునః నిర్మాణానికి నోచుకోలేదు. పెచ్చులూడడంతో ఏ క్షణంలో కూలిపోతాయోనని భయాందోళనలో ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. మాదివాడ 2వ వార్డులోని జానకీనగర్‌లో ఎంపీపీ పాఠశాల శ్లాబ్ శిథిలావస్థకు చేరింది. ఒకటో వార్డులో తరగతి గదులు లేకపోవడంతో జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలోని ఒక గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఇక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమస్యలే సమస్యలు. అదనపు తరగతి గదులు పనులు ప్రారంభించి నాలుగేళ్లు కావస్తున్న నేటికి పూర్తికాలేదు. ఇలా మండలంలో కొన్ని పాఠశాలల్లో సమస్యలు కోకొల్లలు. వీటిపై ఎంఈవో రవీంద్రను ప్రశ్నించగా త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయంటున్నారు.

నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

మొగల్తూరు, జూన్ 12 : పాఠశాలలు ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభంకావల్సి ఉండగా రాష్ట్రంలో నూతన ప్రభుత్వం కొలువు తీరడంతో గురువారం నుంచి పాఠశాలలు పున ప్రారంభించాలని ఆదేశాలు రావడంతో ఆదిశగా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి పది ఉన్నత పాఠశాలలు, 68 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ప్రాథమికొన్నత పాఠశాలకు 46,150 పాఠ్యపుస్తకాలు స్టాక్ పాయింట్‌కు చేరాయి. మరికొన్ని పుస్తకాలతో పాటు విద్యాకానుక కిట్లు కూడా మరో రెండు రోజుల్లో రానున్నాయని ఎంఈవో శ్యామ్యూల్ జాన్ తెలిపారు. అలాగే మౌలిక వసతులు, మధ్యాహ్న బోజన ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు.

ప్రమాణస్వీకారోత్సవానికి తరలిన నేతలు



పెనుమదం నుంచి తరలిన నాయకులు



నరసాపురంలో ర్యాలీకి జెండా ఊపుతున్న పొత్తూరి



గణపవరంలో సంబరాలు చేసుకుంటున్న కూటమి శ్రేణులు

భీమవరం టౌన్, జూన్ 12 : కూటమి అభ్యర్థుల ప్రమాణ స్వీకారానికి భీమవరం జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్ళారు. చల్లా రాము కొప్పినీడి బాబీ రాట్నాల శ్రీనివాసరావు పిల్లా నారా యణ మూర్తి మదాసు సాయి, యాస అనిల్ యినుకొండ భోగేశ్వరరావు యడ్లపల్లి రాంబాబు పాల్గొన్నారు.

● నరసాపురం : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో సుమారు 200 మంది కార్లు, బస్సుల్లో విజయవాడ వెళ్లారు. జనసేన పార్టీ కార్యాలయం నుంచి కార్లల్లో ఆపార్టీ నాయకులు బయలుదేరి వెళ్లారు. మాజీ మంత్రి కొత్తపల్లి, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు వారి అనుచరులతో విజయవాడ వెళ్లారు. కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, జక్కం శ్రీమన్నారాయణ, సంకు భాస్కర్, వలవల నాని, కోటిపల్లి వెంకటేశ్వరావు తదితరులు వెళ్లారు.

● ఆకివీడు : చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారోత్సవానికి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు బస్సులు, కారుల్లో వేలాదిగా తరలివెళ్లారు.

● మొగల్తూరు : చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవానికి టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలు, పాలా రాంబాబు, డొల్లా రత్నంరాజు, పాలా గోపాలం తదితరులు మూడు బస్సులు, ప్రత్యేక కార్లలో వెళ్లారు.

● గణపవరం : చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి కూటమి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, గణపవరం పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న నాయకత్వంలో వాహనాలపై తరలి వెళ్లారు.

● పోడూరు : డాక్టర్ నిమ్మల రామానాయుడుకి మంత్రి పదవి ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌ల్లో ప్రమాణస్వీకార దృశ్యాలను తిలకించారు.

● తాడేపల్లిగూడెంరూరల్ : చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవానికి టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ సారథ్యంలో తాడేపల్లిగూడెం మండలం నుంచి కూటమి నాయకులు వెళ్లగా గన్నవరం వద్ద ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ముందుకు వెళ్లనీయకపోవడంతో ప్రమాణ స్వీకారోత్సవం చూడకుం డానే వెనుదిరిగినట్టు వారు తెలిపారు.

ఈఏపీ సెట్‌లో 'ప్రగతి'కి ర్యాంకులు



తేజశ్రీ దుర్గ, లీలా శ్రీసత్యవతి

తణుకు, జూన్ 12: ఏపీ ఈఏపీ సెట్‌లో తణుకు ప్రగతి జూనియర్ కాలేజి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిం చినట్టు కళాశాల డైరెక్టరు ఎంఎస్ఆర్ ఆంజనేయులు (ప్రగతి రాజా) తెలిపారు. తమ విద్యార్థులు ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చ ర్ విభాగాలలో ఆధిక్యతను చాటుకున్నార న్నారు. బి.తేజ శ్రీదుర్గ 1134 ర్యాంకు, బి.లీలా శ్రీసత్యవతి 2051, కె.బాలశ్రీ 2425, వై.ప్రజ్ఞ సౌమ్యశ్రీ 4571, ఎన్.హరణి 4731, ఆర్ఎస్ఎం పద్మ 4851 ర్యాంకు సాధించారన్నారు. పది వేలు లోపు 20 ర్యాంకులు, 20 వేలులోపు 79 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రు లు, అధ్యాపకులను ఆయన అభినందించారు.

సెమిస్టర్ ఫలితాల్లో 98.53 ఉత్తీర్ణత

పాలకొల్లు, అర్బన్, జూన్ 12 : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఈ నెల ఏడో తేదీన జరిగిన ఆరో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను (ఇంటర్న్‌షిప్) ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి బుధవారం విడుదల చేశారు. మొత్తం 272కి 268 మంది విద్యార్థులు ఉత్తీర్ణత (98.53 శాతం) సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు



చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..





వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

పీఎం అవార్డుల ఎంపికకు కేంద్ర బృందం పర్యటన



కలెక్టర్‌ను కలసిన పీఎం అవార్డుల బృందం

ఏలూరు కలెక్టరేట్, జూన్ 12 : ప్రధానమంత్రి అవార్డులు-2023 ఎంపిక కోసం జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు బుధవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బృందం సభ్యులైన భూపేంద్ర సింగ్, శ్రీవత్సలకు పూలమొక్కలను అందించి కలెక్టర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న పీఎం ఆవాస్‌యోజన, మిషన్ ఇంద్ర ధనుష్, పీఎం స్వానిధి, పీఎం విశ్వకర్మ యోజన, ముద్రా యోజన, హర్‌ఘర్‌జల్ యోజన, పీఎం మాతృవందన యోజన, పీఎం పోషణ యోజనకు సంబంధించిన వివరాలను వారికి కలెక్టర్ తెలిపారు.

అవార్డుల కోసం నామినేషన్ల ఆహ్వానం

ఏలూరు కలెక్టరేట్, జూన్ 12: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రిపబ్లిక్‌డే సందర్భంగా 2025 సంవత్సరానికి దేశపౌర, ప్రతిష్ఠాత్మక పద్మా అవార్డ్స్, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డుల కోసం నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్టు సెట్‌వెల్ సీఈవో ఎమ్డీ మెహ్రాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవార్డులు పొందగోరే వారు చేసిన సేవలు, కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక, సాంఘికసేవ, సైన్స్, ఇంజినీరింగ్, ప్రజాసంబంధాలు, సివిల్ సర్వీస్, ట్రేడ్, ఇండస్ట్రీస్ అవార్డులకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పేర్కొన్న రంగాల్లో సేవలు చేసి ఉన్నవారే అర్హులన్నారు. ఉత్తమసేవ కనబరిచిన వారి దరఖాస్తు ఏపీ ప్రభుత్వం వెబ్‌సైట్‌లో 800 పదాలకు మించకుండా జూలై పదో తేదీ లోగా నమోదు చేసుకోవాలన్నారు. పద్మా అవార్డుల ఎంపికకు సంబంధించిన ఇతర వివరాలు భారతప్రభుత్వం శాంతిభద్రతల మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ప్రతిపాదనలు ప్రతిహార్డ్ కాపీ, సెట్‌వెల్ కార్యాలయానికి, సాఫ్ట్‌కాపీ, స్టెప్‌డాట్ వెస్ట్ గోదావరి యట్ ది రైట్ ఆఫ్ జీ మెయిల్ డాట్ కామ్‌కు మెయిల్‌కు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

గుండెపోటుతో గరగపర్రు వీఆర్వో మృతి



స్వామినాయుడు (ఫైల్)

పాలకోడేరు, జూన్ 12: గరగపర్రు వీఆర్వోగా పనిచేస్తున్న సంతత స్వామినాయుడు(49) బుధవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. గరగపర్రు గ్రామంలో వీఆర్వోగా పని చేస్తున్న స్వామినాయుడు రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురి కావడంతో ఆసుపత్రికి వెళ్లారు. డాక్టర్లు యాంజియయ్ గ్రామ్ చేయించుకోవాలని సూచించడంతో బుధవారం ఆయన స్వగ్రామం తాడేరు నుంచి భార్యను బైక్‌పై ఎక్కించుకుని నేరుగా ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రిలో యాంజియయ్‌గ్రామ్ చేస్తుండగా మరోసారి గుండెపాటు వచ్చిందని తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని మండల రెవెన్యూ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

మొదలైన ఇసుక కష్టాలు

- నిలిచిన ఎగుమతులు
- జూన్ మూడో తేదీతో అమ్మకాలు బంద్
- వరదలు వస్తే తప్పని ఇబ్బందులు
- కిరాయిలు లేక లారీ యజమానుల ఆందోళన

కూటమి అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక పాలసీని మళ్లీ తీసుకువస్తామని టీడీపీ నేత చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఆ హామీ నెరవేర్చాలని వినియోగదారులు, టిప్పర్ లారీ యజమానులు కోరుతున్నారు.

నూతన పాలసీకై ఎదురుచూపు



పడ్డిలంక ర్యాంపు (ఫైల్)

పాలకొల్లు, జూన్ 12 : ఉమ్మడి జిల్లాలో ఇసుక కష్టాలు మొదలయ్యాయి. జూన్ మూడో తేదీ తెల్లవారు జాము వరకు ఇసుక అక్రమ రవాణా జరగ్గా, ఎన్నికల ఫలితాలు వెలువడం మొదలైన వెనువెంటనే ఇసుక ఎగుమతులు నిలిపివేశారు. ఐదేళ్లపాటు ఇసుక అమ్మకాలను ఇష్టారాజ్యంగా చేసి, వేల కోట్ల రూపాయలు తాడేపల్లికి చేర్చిన ఇసకాసురులు ఈనెల నాలుగో తేదీ నాటికి దుకాణాలు సర్దేశారు. అనూహ్యరీతిలో కూటమికి ప్రజలు పట్టం కట్టడంతో జె-బ్రాండ్ మూకలు నిశ్శబ్దంగా ఇసుక ర్యాంపులు, స్టాక్ పాయింట్ల నుంచి దుకాణం సర్దేశారు.

నిలిచిన ఎగుమతులు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 20పైబడి ఇసుక ర్యాంపులు ఉన్నాయి. వీటిలో కొన్నింటిలో నేరుగా గోదావరిలోకి లారీలు వెళ్లి ఇసుక ఎగుమతి చేసుకునే విధానం ఉండగా పలు ర్యాంపులలో పడవలలో ఒడ్డుకు తెచ్చిన ఇసుకను లారీల్లో ఎగుమతి చేస్తారు. జూన్ మూడో తేదీ తెల్లవారుజాము వరకూ జరిగిన ఎగుమతులు, ఎన్నికల ఫలితాలతో ఒక్కసారిగా నిలిచాయి.

నూతన పాలసీ రూపొందించాలి..

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో ఇసుక ఉచితంగానే సరఫరా చేశారు. కేవలం రూ. 5, 6 వేలకు ట్రాన్స్‌పోర్టు ఖర్చుతో ఐదు యూనిట్ల ఇసుక వినియోగదారుడికి లభించేది. జగన్‌రెడ్డి పాలనలో ఐదు యూనిట్ల ఇసుక రూ. 20 వేలుకు చేరింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇసుక తవ్వకాలపై పాలసీ రూపొందించాలని వినియోగదారులు కోరుతున్నారు.

కిరాయిలు లేక ఆందోళన..

వారం రోజులుగా ఇసుక ఎగుమతులు పూర్తిస్థాయిలో నిలిచిపోవడంతో టిప్పర్ లారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. కిరాయిలు లేకుంటే లారీల యజమానులు ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు పడతామని పలువురు లారీ యజమానలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

వరదలు వస్తే ఇబ్బందులే..

సాధారణంగా ప్రతీ ఏటా గోదావరి నదికి జూన్ నెలాఖారు లేదా జూలై మొదటి వారంలోనే వరదలు వస్తుంటాయి. భారీ వర్షాలు కురిస్తే గోదావరి వరద నీటితో పొంగుతుంది. వరద వస్తే పోలవరం నుంచి నరసాపురం వరకు గోదావరిలో ఇసుక తవ్వకాలు నిలిచిపోతాయి. అదే జరిగితే నవంబరు వరకు ఇసుక కష్టాల సమస్య పరిష్కారం లభించదు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రోజుల వ్యవధిలో ఇసుక పాలసీని ప్రకటిస్తే ఆ వెంటనే సంబంధిత శాఖ అనుమతులు లభించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే ఇసుక తవ్వకాలు మొదలవుతాయి.

ఇసుక కొల్ల గొట్టేశారు..

జగన్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ర్యాంపులలో పరిమితికి మించి ఇసుక తవ్వేశారు. రెండు లేదా మూడు అడుగుల మేర మేట వేసిన ఇసుకను తవ్వాల్సి ఉండగా పలు ర్యాంపులలో 5, 6 అడుగుల లోతున ఇసుకను తవ్వేశారు. ఇసుక నాణ్యత తగ్గితే బొండు ఇసుక పేరుతో పల్లపు ప్రాంతాలు, లే ఔట్ల పూడికలకు తరలించేవారు. మొత్తంగా కొన్ని ర్యాంపులలో ఇసుక తవ్వకాలకు స్టాక్ పాయింట్లలో అనుమతి ఇవ్వాలి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తీపర్రు, చిడిపి, తదితర ప్రాంతాల్లో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో కాతేరు, లాలా చెరువు, రావులపాలెం, గన్నవరం వంటి ప్రాంతాల్లో ఇసుక నిల్వలు ఉన్నాయి. నూతన పాలసీ వచ్చేలోపు స్టాక్ పాయింట్లలోని ఇసుక ఎగుమతులకు అనుమతులు ఇవ్వాలని లారీ యజమానులు, వినియోగదారులు కోరుతున్నారు.

నూతన పాలసీకై ఎదురు చూస్తున్నాం



అసోసియేషన్ ద్వారా కూటమికి మద్దతును నేరుగా ప్రకటించాము. ఇచ్చిన మాట ప్రకారం కూటమి విజయానికి కృషి చేశాం. ఇప్పుడు కొలువు దీరే ప్రభుత్వం వెంటనే ఉచిత ఇసుక పాలసీ రూపొందించి, అదేవిధంగా లారీ యజమానులకు నష్టం రాని విధంగా కిరాయిలు రూపొందించి నష్టాల్లో కూరుకుపోయిన టిప్పర్ లారీ యజమానులను ఆదుకోవాలి.

- రావూరి రాజా. పాలకొల్లు
ఉభయ గోదావరి జిల్లా టిప్పర్ లారీ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు

స్నేహితులతో కలసి బీచ్‌కు వెళ్లి..

» రామాపురం సముద్రతీరంలో తాడేపల్లిగూడెం విద్యార్థి మృతి



కె.గౌరీష్ (ఫైల్)

రామాపురం(చీరాల టౌన్), జూన్ 12 : చీరాలలోని రామాపురం సముద్రతీరంలో తాడేపల్లిగూడెం పరిధిలోని కె.పెంటపాడుకు చెందిన విద్యార్థి మృతి చెందిన ఘటన జరిగింది. వివరాలివి.. కె.పెంటపాడుకు చెందిన కనగళ్ల గౌరీష్(21) చెన్నై ఎంజీఆర్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి కేవీ సత్యనారాయణ సేల్స్‌మెన్‌గా పనిచేస్తూ కుమారుడిని చదివిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున విజయవాడలో ఉంటున్న స్నేహితులు సృజన్, అభినవ్, హరీష్, అయాన్‌తో కలిసి రామాపురం సముద్రతీరానికి బైక్‌లపై వచ్చారు. ఉదయం ఆరు గంటలకే సముద్రంలోకి దిగా రు. కొద్దిసేపటికే అలల తాకిడికి గౌరీష్, సృజన్, అభినవ్, అయాన్ కొట్టుకుపోబోయారు. అదృష్టవశాత్తు ముగ్గురు ఒడ్డుకు చేరగా గౌరీష్ లోపలకు కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. ఈ మేరకు మిత్రులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభిస్తుండగానే అదే ప్రాంతంలో గౌరీష్ విగతజీవిగా ఒడ్డుకు చేరాడు. సమాచారం అందుకున్న వేటపాలెం పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడు విగతజీవిగా ఉండటాన్ని చూసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్ద బోరున విలపించారు.

రెండు రోజుల్లో వస్తానని తల్లికి ఫోన్..

గౌరీష్ ఈనెల 2వ తేదీన విజయవాడలోని మిత్రుడు సృజన్ వద్దకు వచ్చి అక్కడే ఉంటున్నాడు. తల్లిదండ్రులకు చెన్నైలోనే ఉన్నట్టు ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. మంగళవారం రాత్రి తల్లికి ఫోన్ చేసి చాలాసేపు మాట్లాడాడు. రెండు రోజుల్లో వస్తానని ఫోన్ ముగించాడు. ఈలోపు తెల్లారేసరికి కుమారుడి మరణవార్త విన్న తల్లి శోకసంద్రంలో మునిగిపోయింది.

రైలు ఎక్కుతూ జారిపడిన వ్యక్తిని..



ఇరుక్కుపోయిన వ్యక్తిని బయటకు తీస్తున్న దృశ్యం

భీమవరం క్రైం, జూన్ 12 : రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి రైలుకు.. పట్టాలకు మధ్య ఇరుక్కుపోయిన వ్యక్తిని చాకచక్యంగా కాపాడారు. వివరాలివి.. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నుంచి గుంటూరు ప్యాసింజర్ రైలు భీమవరం రైల్వేస్టేషన్‌కు వచ్చి ఆగింది. ఆ సమయంలో ప్లాట్‌ఫామ్ పనులు చేసుకునే పల్లాబత్తుల చినబాబు అనే వ్యక్తి రైలు ఎక్కుతూ జారిపడిపోయాడు. సత్వరమే అక్కడున్న రైల్వే సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే రైలును సిగ్నల్ ఇవ్వకుండా ఆపి ప్లాట్‌ఫామ్‌ను గునపాలతో బద్దలు కొట్టి అతడిని కాపాడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సుమారు గంట సేపు రైలును నిలుపుదల చేశారు.

కొబ్బరి చెట్టు దగ్ధం

ఆకివీడు, జూన్ 12: ఓ గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్టు కాల్చిపారేయడంతో కొబ్బరి చెట్టు దగ్ధమైన ఘటన అజ్జమూరులో జరిగింది. అజ్జమూరు గరువుకు చెందిన బచ్చు కృష్ణ నివాసంలో వెనుక వైపు ఉన్న కాగితాలలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్టు కాల్చి పారివేయడంతో అంటుకున్నాయి. పక్కనే ఉన్న కొబ్బరి చెట్టు పూర్తి కాలిపోయింది. అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వగా వచ్చి మంటలను అదుపుచేశారు. రూ.10వేలు నష్టం వాటిల్లిందని అగ్నిమాపకశాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

15న జాబ్‌మేళా

ఏలూరు కలెక్టరేట్, జూన్ 12 : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ప్రభుత్వ యువజన సర్వీస్‌లశాఖ, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15న కలెక్టరేట్ కాంపౌండ్‌లోని సెట్‌వెల్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణ రావు ఓ ప్రకట నలో పేర్కొన్నారు. స్పందన, స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఉద్యోగానికి సంబం ధించి ఇంటర్వ్యూ జరుగుతుందన్నారు. బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ పురుషులకు రూ.12,500 నుంచి ప్రారంభమై బదిలీ అలవెన్స్, ఇన్‌సెంటివ్స్, ఉచిత భోజన, వసతి సౌకర్యం, ఆరోగ్యబీమా రూ.4 లక్షలు, ప్రమాదబీమా రూ.20 లక్షలు ఇవ్వబడుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు.. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో అనుభవం ఉండాలని, 21 నుంచి 27 ఏళ్ళ లోపు వయసు, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. హనుమాన్‌జంక్షన్ సమీపంలోని మల్లవల్లి వద్ద నున్న మోహన్ స్పిన్‌టెక్స్‌లో ఉద్యోగం కోసం గార్డులు పురుషులకు రూ.11 వేల నుంచి రూ.13వేలు జీతం. 8వ తరగతి నుంచి డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు 88868 82032 నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మోగల్లులో ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



ఆసుపత్రికి వచ్చిన యువకుడు

పాలకోడేరు, జూన్ 12: మోగల్లు గ్రామంలోని అల్లంకోడు ప్రాంతంలో ఉపాధి పనులు చేస్తుండగా బుధవారం తేనెటీగలు దాడి చేశాయి. అక్కడ పనులు చేస్తున్న గ్రామానికి చెందిన దాసరి రాజేష్‌పై ఒక్కసా రిగా తేనెటీగలు దాడి చేశాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు చేతుల తో కొడుతుండగా మరోచేతికి తేనెటీగ కుట్టడంతో కంగారులో తన చేతిలో ఉన్న కొడవలితో చేతి వేలిని కోసుకున్నాడు. సత్వరమే తోటి ఉపాధికూలీలు పాలకోడేరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చి చికిత్సను అందించారు.